రేపు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

చందానగర్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం (ఉత్తర ఫల్గుణి నక్షత్రం) సందర్భంగా శుక్రవారం చందానగర్ గంగారంలోని జగద్రక్షక శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఏకశిలా పదునెట్టాంబడి పూజామహోత్సవం నిర్వహిస్తున్నట్లు సౌభాగ్యానందనాద ప్రసాద రావు గురుస్వామి బుధవారం తెలిపారు. ఉదయం 5.30 గంటలకు గణపతి హోమం, 6.15 గంటలకు స్వామి నలుగుస్నానం పంచామృత అభిషేకం, 108 కలశాలతో అభిషేకం, కనకాభిషేకం విశేష అలంకారం, అష్టోత్తర పూజ, మధ్యాహ్నం 1.00 గంటకు నైవేద్య సమర్పణ, అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు పడి పూజ (అష్టాదశ సోపానాలకు) రాత్రి 9.45 గంటలకు నైవేద్యం అనంతరం అల్పాహార వితరణ ఉంటుందని భక్తులు హాజరవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని


డా.ఆర్తి నాగ్‌పాల్ మెహతా

రాయదుర్గం: హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని డాక్టర్ ఆర్తి నాగ్‌పాల్ మెహతా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమయ్యారు. బెంగళూరులోని చాణక్య విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. ఆమె హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ పూర్వ విద్యార్థిని. 2020లో ఆమె హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ నుంచి సైకాలజీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆర్‌డీఓ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం రంగారెడ్డిజిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఆర్‌డీఓ కె వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కె వెంకారెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ భూముల వివరాలను ప్రభుత్వానికి అందించినట్లు కూడా తెలిసింది.

13న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 13వ తేదీ 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరగనున్న కార్యక్రమంలో 'పర్స్‌పెక్టివ్ ఎక్స్‌ప్లోరింగ్ ది మైండ్-బాడీ కనెక్షన్' అనే అంశంపై ఫిజియోథెరపి ఐకాన్-2022, ఒడిశా యూత్ ఐకాన్ ప్రొఫెసర్ ప్రేమ్ రంజన్ ఓజా ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మంది పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ. 2 వేలు జరిమానా, ఇద్దరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పోలీస్ అధికారులకు సన్మానం


సీఐ నరసింహ, ఎస్ఐ రాజేష్‌లను సన్మానించిన హిందూ రాష్ట్ర సమితి సభ్యులు

ఆల్విన్‌కాలనీ: శ్రీరాముని శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసిన జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఎస్ఐ రాజేష్‌లను ఆల్విన్‌కాలనీ హిందూ రాష్ట్ర సమితి సభ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు వెంకటస్వామి రెడ్డి, బల్గూరి రంగారావు, చారి, రామరాజు ఉన్నారు.

తొండుపల్లిలో ఉచిత అంబలి కేంద్రం ప్రారంభం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లిలో ఉచిత అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ అంజయ్యగౌడ్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ అంబలి కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. వేసవిలో దాహార్తి తీర్చడంతో పాటు ఆకలిని తగ్గించేందుకు అంబలి కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని మాజీ కౌన్సిలర్ లావణ్య అన్నారు.

ఇండోర్‌లో ఈసారైనా..


ఖాజాగూడలోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియం

- జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 13 ఏళ్లు
- ఇండోర్ స్టేడియం పూర్తై 8 సంవత్సరాలు
- అవుట్‌డోర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ సామగ్రి చెత్త కేంద్రం
- ఇదీ ఖాజాగూడ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిస్థితి

8 ఏళ్లుగా వేసవి శిబిరాల ఏర్పాటు మరిచిన అధికారులు

రాయదుర్గం: కోట్లు వెచ్చించి నిర్మించిన ఖాజాగూడ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వేసవిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా క్రీడా శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని ఇండోర్ స్టేడియంలో ఇప్పటి వరకు శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయకపోవడంపై క్రీడాకారులు, యువత, విద్యార్థులు విస్తుపోతున్నారు. స్పోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 13 ఏళ్లు కాగా ఇండోర్ స్టేడియం నిర్మించి 8 సంవత్సరాలు అయినా అందుబాటులోకి రాకపోవడం విడ్డూరం. ఈ ఏడాది అయినా వేసవి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఖాజాగూడ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్ కాంప్లెక్స్ వివరాలు..

- ఖాజాగూడ సర్వే నంబర్ 27లో 7.5 ఎకరాల విస్తీర్ణంలో జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్ ఉండేది
- వీకెండ్స్‌లో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు క్రికెట్ ఆడేవారు. స్థానికులు ఆడుకుంటూ ఉండేవారు
- 2012లో జూలై 21న అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు.
- మొదట్లో రూ.2.10 కోట్లు విడుదల చేశారు. నిధులు సరిపోకపోవడంతో మరో రూ.26 లక్షలు విడుదల చేశారు. ఆతర్వాత మరో రూ.11 లక్షలను కూడా జీహెచ్‌ఎంసీ కేటాయించింది.
- ఈ నిధులతో 2,700 గజాల విస్తీర్ణంలో ఇండోర్ స్టేడియంలో నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులు, క్యారమ్స్, కోచ్లు, ఇతరులకు ప్రత్యేక గదులు, మల్టీపర్పస్ మినీ జిమ్, క్రీడాకారుల కోసం కూడా ప్రత్యేక గదులను నిర్మించారు.
- అవుట్‌డోర్ స్టేడియం ప్రాంతంలో ఫ్లైఓవర్ల నిర్మాణ సామగ్రి తయారీ కేంద్రం, చెత్త కేంద్రంను కూడా ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో క్రికెట్‌కు తెరపడినట్టైంది.
- ఆ తర్వాత ఇండోర్ స్టేడియం పూర్తయినా తాళం వేసి ఉంచారు. జీహెచ్‌ఎంసీ అవసరాలకు వాడుకున్న తర్వాత కూడా తాళం వేసి ఉంచడం జరుగుతోంది.
- ఇప్పటికైనా ఈ ఇండోర్ స్టేడియంలో క్రీడా శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపకమిషనర్‌కు వినతి


ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చందానగర్: కులగణన సర్వేలో పాల్గొన్న అంగన్వాడి టీచర్లకు వేతనం ఇవ్వాలంటూ బుధవారం చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారని సర్వేకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు నిర్ణయించిందని, కానీ ఇప్పటికి వరకు డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ విభాగాల ఉద్యోగులకు ఇచ్చారని అంగన్‌వాడీ టీచర్లకు ఇవ్వలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

చందానగర్ ఎస్‌హెచ్‌ఓ పాలవెల్లి బదిలీ

చందానగర్: చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న పాలవెల్లి సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. నూతన ఎస్‌హెచ్‌ఓగా పేట్ బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌ని నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

నివాళి



రాయదుర్గం: శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు కొమరగొని శంకర్‌గౌడ్‌కు ఎమ్మెల్యే గాంధీ నివాళులు అర్పించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో బుధవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కొమిరిశెట్టి సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు బాలింగ్ గౌతమ్‌గౌడ్, మంత్రిప్రగడ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి

బండ్లగూడ: తెలంగాణలో సన్న బియ్యం.. సన్న బియ్యం అంటూ కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల మంజూరు సంగతి ఏమైందో చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎన్ని కొత్త రేషన్ కార్డులు జారీ చేశారో చెప్పే పరిస్థితి పాలకుల్లో లేదన్నారు.

వివేకానందనగర్ సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్‌పోల్స్, వీధి దీపాలు, వైకుంఠధామం, మంచినీటి సమస్య పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో పాటు ఆయా శాఖల అధికారులతో త్వరలో సమావేశమై పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెవూరి మధుసూదనాచారి, మాజీ అధ్యక్షులు రోణంకి జగన్నాథం, సభ్యులు సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలి

- అలకాపూర్ గేటెడ్ కమ్యూనిటీల్లో నీటి ఎద్దడి
- పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గేటెడ్ కమ్యూనిటీల నాయకులు

మణికొండ: వేసవిలో ఎండలు పెరిగిపోవటంతో బోర్లు వట్టిపోయి నీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని, జలమండలి వారితో ట్యాంకర్ల నీటిని సరఫరా చేయించాలని గ్రేటర్ అలకాపూర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (గార్వా) నాయకులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. బుధవారం ఆయనను తన నివాసంలో కలిసి గేటెడ్ కమ్యూనిటీలలో ఉన్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ... అలకాపూర్ టౌన్‌షిప్ పక్కనే ఉన్న నెక్నాంపూర్ చిన్నచెరువులో గుర్రపుడెక్క పెరిగి పోవటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయన్నారు. గుర్రపు డెక్క తొలగింపు, టౌన్‌షిప్ మురుగునీరు చెరువులో కలవకుండా పక్క నుంచి మూసీ నదిలోకి పోయేలా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. దాంతో అనేక సమస్యలు దూరం అవుతాయని, ఇరిగేషన్ వారు చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. వర్షపు నీరు చెరువులోకి చేరేలా అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో గార్వా నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు రోల్‌మోడల్స్

టీఐఎస్ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సోనియాసాహ్నీ


అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సోనియాతో ఫ్యాకల్టీ, విద్యార్థులు

రాయదుర్గం: ఉపాధ్యాయులు రోల్‌మోడల్స్ అని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా సాహ్నీ అభివర్ణించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని విద్య, విద్యా సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'విద్య మరియు సాంఘికీకరణ'పై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య మరియు సంస్కృతి మధ్య పరస్పర సంబంధాన్ని వివరించారు. విద్యాపరంగా అనేక ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ అసమానత కూడా కొనసాగుతోందన్నారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జేవి మధుసూదన్, డాక్టర్ రావుల కృష్ణయ్య, డాక్టర్ టి సుమాలిని, డాక్టర్ ఏఎస్ జలంధరాచారి, డాక్టర్ కోహిలాదేవి, డాక్టర్ ఉజ్జలసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనులు పరిశీలన


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు చేపడుతున్న నాల నిర్మాణ పనులను అధికారులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఎఫ్‌సిఐ, వీడియో, టీఎన్‌నగర్ కాలనీల మధ్యలో నుండి నాలా వద్దని గతంలో నాలా విస్తరణ పనులను చేపట్టాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీవాసులు, అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాలనీ వాసుల సమస్యలను ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లి సమస్య త్వరలో పరిష్కరించే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉమా కిషన్, మహిళా అధ్యక్షురాలు సుప్రజ, కాలనీవాసులు రమేష్, రవీందర్ రెడ్డి, జగన్, ఎంవీరావు తదితరులున్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఏసీపీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, ట్రాఫిక్ అధికారులు

రాయదుర్గం: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని మాదాపూర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ కె.సత్యనారాయణ సూచించారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారి నరేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు గణేష్ పటేల్, హన్మిరెడ్డి, ఎస్ఐలు రాములు, నాగరాజు, డాక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపల్ సృజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గులాబీలతో అవగాహన

మల్కంచెరువు ముందున్న పాత ముంబాయి జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి ఏసీపీ సత్యనారాయణ, ఎస్‌కేవై అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ తదితరులు గులాబీలను అందించారు. విధిగా హెల్మెట్ వాడాలని, కారులో సీటుబెల్టు ధరించాలని సూచించారు. మీ తోటివారికి కూడా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

హెచ్‌సీయూలో చిత్ర ప్రదర్శన.. సంతకాల సేకరణ


చిత్ర ప్రదర్శన


మాస్ సంతకాల సేకరణ

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రధాన గేటు వద్ద అఖిల భారత విద్యార్థి పరిషత్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫొటో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. జంతువులు, పక్షులు, పాములు, నీటి వనరుల కేంద్రాలు, వృక్ష సంపద, పచ్చదనం చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ జంతువుల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

సంతకాల సేకరణకు స్పందన

హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం ఏబీవీపీ చేపట్టిన మాస్ సంతకాల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద విద్యార్థులు, ఉద్యోగులు, ఇతరులు హెచ్‌సీయూ భూముల రక్షణకు మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. సంతకాల సేకరణ పూర్తయ్యాక భారత రాష్ట్రపతిని కలిసి అందిస్తామని నాయకులు తెలిపారు. పలువురు ఏబీవీపీ హెచ్‌సీయూ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజేంద్రనగర్: రిటైర్డ్ ఉద్యోగులు సంఘటితంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కిస్మత్‌పూర్ శాఖ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సంఘం సభ్యులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆరోగ్యమస్తు..!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు
- ఈనెల 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- రోజూ ఒక థీమ్‌తో పౌష్టికాహారంపై అవగాహన
- ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్టు పరిధిలో విస్తృత ప్రచారం


అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువల గురించి తెలియజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బంజారాహిల్స్: మాతాశిశు సంరక్షణ, ఆరోగ్యవంతమైన సమాజానికి పోషణ పక్షోత్సవాలు ఈనెల 8 నుంచి ప్రారంభమయ్యాయి. పోషకాహారం విలువను తెలియజేసేలా ఈ కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ వరకు ఐసీడీఎస్ ఖైరతాబాద్-2 పరిధిలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తిస్థాయిలో పోషకాహారం అందేలా చర్యలు తీసుకోనున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భద్రతకు పెద్దపీట వేస్తూనే ఇంకోవైపు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్-2 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు కలిసి 20వేల మందికి పైగా ఉన్నారు.

అవగాహన ఇలా..

స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను ఉపయోగించి అనుబంధ ఆహార వంటకాల తయారీపై ఈ రెండు వారాలు ప్రదర్శనలు చేపడతారు. తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్ఆర్‌సీకి తరలించే ఏర్పాట్లు చేస్తారు. పండ్లు, కూరగాయలు, వ్యాయామం వల్ల ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా తెలియజేస్తారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. అంగన్‌వాడీ సిబ్బందితో పాటు వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు.

తక్కువ బరువు, పోషణ లోపంతో ఉన్న చిన్నారుల గుర్తింపు..

ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్ట్ పరిధిలో తక్కువ బరువు, పోషణ లోపంతో ఉన్న చిన్నారులను ఇటీవలనే గుర్తించారు. గర్భిణులు, బాలింతలతో పాటు కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు గుడ్లు, బాలామృతం ఇస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది పోషకాహారం లోపంతో బాధపడుతున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఉంటుండడంతో నివారణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవలను పూర్తిగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

పక్షం రోజుల కార్యక్రమాలు ఇలా..

శిశువు జన్మించిన మొదటి వెయ్యి రోజులపై ప్రత్యేక దృష్టి అనే థీమ్ ప్రామాణికంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. 15 రోజుల పాటు ఓ కార్యక్రమం చొప్పున పోషకాహార లోపాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తారు. గర్భిణుల సంరక్షణపై వారి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగిస్తారు. పిల్లల వయస్సుకు తగిన ఎదుగుదల, తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తారు. శిశువులో ఇన్ఫెక్షన్ల నివారణకు, పరిశుభ్రత నిర్వహణపై తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తారు.


ఇదొక మంచి కార్యక్రమం



పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై ఇక్కడ అవగాహన కలిగిస్తున్నారు. ఎలాంటి ఆహారం తీసుకుంటే బలంగా ఉండవచ్చో సూచిస్తున్నారు. సరైన పోషణ ద్వారా తల్లీపిల్లలు క్షేమంగా ఉండే విషయాలను వివరిస్తున్నారు. ప్రతిరోజూ మేము అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం ఎందులో లభిస్తుందో తెలుసుకుంటున్నాం.

– హైమావతి

అందరికీ అవగాహన కలిగిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అవగాహన కలిగించాం. ప్రతిరోజూ ఒక థీమ్‌తో ముందుకువెళ్తున్నాం. బాలింతలు, గర్భిణులతో పాటు చిన్నారుల తల్లులకు పోషకాహారంపై అవగాహన పెంచుతున్నాం. బలమైన ఆహారం తీసుకోవడం ద్వారా కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తున్నాం. గృహ సందర్శన కూడా చేస్తాం.

– శివమ్మ, అంగన్‌వాడీ టీచర్, జ్ఞానీజైల్‌సింగ్‌నగర్